సాక్షి నంద్యాల

గురువారం । 29 । జూన్ । 2023



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం శ్రీశైలమహాక్షేత్రంలో సాక్షిగణపతి స్వామి, ఆలయ ఆవరనలో జ్వాలావీరభద్రస్వామికి అభిషేకాలు, పుష్పార్చనలు నిర్వహించారు.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా బుధవారం నిత్యకళావేదికపై గుంటూరు రుద్రకళాక్షేత్రంతో నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



తొలగిన దారిద్ర్యం

ఆళ్లగడ్డ: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడంతో గ్రామీణ ప్రాంత రహదారుల రూపురేఖలు మారుతున్నాయి. జిల్లాలో 87 పనులకుగాను ఇప్పటికే 17 పూర్తయ్యాయి. 8లో▸

న్యూస్‌రీల్

నమో నారసింహ

- అహోబిలంలో వైభవంగా శ్రీ సుదర్శనమూర్తి జయంతి వేడుకలు



సుదర్శన హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో శ్రీ సుదర్శన మూర్తి జయంతి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఎగువ అహోబిలంలో కొలువైన మూలమూర్తులు శ్రీ జ్వాలానరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవార్లను సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జ్వాలానారసింహస్వామిని, శ్రీ సుదర్శన మూర్తులను కొలువుంచి నవకలశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి,అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉభయ దేవులతో కొలువైన శ్రీ నృసింహస్వామి ఎదురుగా శ్రీ సుదర్శన మూర్తిని కొలువుంచి వేద పండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సుదర్శన హోమం నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమం ముగించారు.

ఆర్టీసీ దూర ప్రాంత ప్రయాణికులకు రాయితీ

నంద్యాల(వ్యవసాయం): ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే వారికి టికెట్ ధరల్లో రాయితీ ఇవ్వనున్నట్లు నంద్యాల జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, బెంగళూరు వంటి దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు రాను, పోను టికెట్లను రిజర్వేషన్ చేసుకుంటే 20 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే జూలై 2వ తేదీన పౌర్ణమి సందర్భంగా నంద్యాల నుంచి అరుణాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా బస్సు సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. టికెట్లు రిజర్వేషన్ కౌంటర్ ద్వారా పొందవచ్చునన్నారు.

మల్లన్నకు నేడు సహస్ర ఘటాభిషేకం

శ్రీశైలంటెంపుల్: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం శ్రీశైల మల్లికార్జునస్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల నుంచి జపపారాయణలు చేస్తున్నారు. గురువారం ఉదయం రుద్రహోమం చేస్తారు. 9గంటల నుంచి 12 గంటల వరకు ఘటాభిషేకం జరుపుతారు.

శ్రీశైలేశుడిని దర్శించుకున్న మంత్రి



శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లను డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎస్. లవన్న, ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. గురువారం నిర్వహించనున్న సహస్ర ఘటాభిషేకంలో మంత్రి దంపతులు పాల్గొంటారు.

కుటుంబాలు కూలిపోయి.. బంధాలు కాలిపోయి!



29.05.2023

మెడికల్ షాపు నిర్వహణతో భార్యాభర్తలు ఏ లోటు లేకుండా జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. బాగా చదివించారు.. ఉద్యోగం రావడం.. పెళ్లి చేయడంతో రెక్కలొచ్చి ఎవరి దారిన వాళ్లు ఎగిరిపోయారు. కుటుంబ యజమాని మంచం పట్టడంతో ఆయన బాగోగులు చూసుకోవడంతో ఆమె మానసికంగా కుంగిపోయింది. చివరకు భర్త మరణం ఆమెను కలచివేసింది. ఇంట్లో ఓదార్చే దిక్కులేదు.. ధైర్యం చెప్పే మనుషుల్లేరు. కొడుకులు వస్తారంటే ఒకరు సప్త సముద్రాల అవల.. మరొకరు వందల కిలోమీటర్ల దూరం.. ఎవరికీ చెప్పుకోలేక ఇంట్లోనే దహన సంస్కారాలు పూర్తి చేసింది.


.. పత్తికొండలో చోటు చేసుకున్న ఈ ఘటన మాయమవుతున్న బంధాలకు అద్దం పట్టింది.

ఒంటరి పయనం

- తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు
- ఉనికి కోల్పోతున్న మానవత్వం
- ఒకే ఇంట్లో ఉంటున్నా ఎవరికి వారే..
- కలసి భోజనం చేయడం కలే
- ఆస్తి కోసం పెరిగిన గెంటివేతలు
- 'చివరి మజిలీ'లో కన్నీటి జీవనం

నేను బాగుంటే చాలు అనుకోవడంతోనే రోజు మొదలవుతోంది. తోడబుట్టిన వాళ్లు.. బంధువులు కూడా డబ్బు ముందు కానివారవుతున్నారు. ఆస్తులు అంతస్తులు.. పిల్లలు సాధించిన విజయాలు.. గడుపుతున్న విలాసవంతమైన జీవితం.. ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ. వ్యక్తిత్వం ఎక్కడో ఒక మూలన మాత్రమే కనిపిస్తుంది. ఆప్యాయత కరువవుతోంది. బంధాలు పలుచన కాగా.. అసూయ పెరిగిపోతుంది. తనకు కష్టం వచ్చినా, ఇతరులు బాధపడినా కన్నీళ్లే వస్తాయనే విషయం బోధపడితే కానీ తెలియని పరిస్థితి. పెద్దగా ఆస్తులు లేకపోయినా.. ఆదాయ వనరులు అంతంత మాత్రమే ఉన్నా.. అప్పట్లో ఉమ్మడి కుటుంబం కష్టసుఖాల్లో తోడు నిలిచింది. ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండటం.. అరమరికలు లేని జీవనం ఉన్నంతలో సంతృప్తి నిచ్చింది. కానీ ఆధునిక ప్రపంచం గుండెలో గోడలు కట్టుకోవడం బంధాలను పలుచన చేస్తోంది.

– సాక్షి, కర్నూలు డెస్క్



➢ చిన్నటేకూరుకు చెందిన రంగయ్య విశ్రాంత ఆర్టీసీ మెకానిక్. భార్య, కుమార్తెలు పట్టించుకోకపోవడంతో ఐదేళ్లుగా అనాథాశ్రమంలో కడుపు నింపుకుంటున్నాడు. చివరకు తనకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించాడు. ఇప్పుడు కోర్టు మెట్లు ఎక్కేందుకు ఆరోగ్యం కూడా సహకరించక నీరసించాడు.

➢ కర్నూలులోని అశోక్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన తండ్రి ఆస్తిని దాన విక్రయంగా పొంది తల్లి, సోదరిని ఇంటి నుంచి గెంటేశాడు. కనీసం చట్ట ప్రకారం ఆస్తి ఇవ్వాలని కోరినా దిక్కున్న చోట చెప్పుకోమంటున్నాడు. కోర్టును ఆశ్రయించినా న్యాయం జరిగేందుకు సమయం పట్టే అవకాశం ఉండటంతో బతికేందుకు ఆర్థిక వనరులు లేక దిక్కులు చూస్తున్నారు.

ప్రపంచం వేగంగా అడుగులు వేస్తుండటంతో ఎవరికి వారు జీవితంలో స్థిరపడాలనే ఉరుకులు పరుగుల జీవనానికి అలవాటుపడ్డారు. చదువు.. ఉద్యోగం.. ఈ రెండింటికి ప్రాధాన్యత పెరుగుతోంది. ఆ తర్వాత ఇల్లు, పిల్లలు వీటితోనే జీవితం గడిచిపోతుంది. డబ్బు.. డబ్బు.. ఈ కరెన్సీ నోట్ల మధ్య సమయం నలిగిపోతుంది. మానవత్వం ఎప్పుడో కానీ ఉనికి చాటుకోలేకపోతుంది. సౌకర్యాలు.. విలాసాలు పెరిగిపోవడంతో వీటి ముందు వ్యక్తిత్వం చిన్నబోతుంది. కుటుంబం అన్న మాటే కానీ.. ఎవరికి వారుగా జీవిస్తున్నారు. చాలా కుటుంబాలు ఇప్పటికే బాగా పలుచబడ్డాయి. విద్య.. ఉద్యోగం.. ఉపాధి.. కారణం ఏదైనా ఇంటికి దూరంగా బతకడం అలవాటైపోయింది. ఇక అక్కడో ఇక్కడో కొంతమంది కలసిమెలసి ఉంటున్నా.. అరమరికలతో తుమ్మితే ఊడిపోయే బంధంగా మారుతోంది. పెద్దల పట్ల గౌరవం తగ్గిపోతుండటంతో ఒకే ఇంట్లో జీవిస్తున్నా ఆత్మీయతలు కనుమరుగవుతున్నాయి. రాక, పోక ఇష్టానుసారం కాగా.. విలువలు గాలికి కొట్టుకుపోయి బంధాలు ఒంటరిగా మిగిలిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఎవరికి వారే భోజనం

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల నేపథ్యంలో అందరూ కలసి భోజనం చేయడం పరిపాటి. ఆ తర్వాత సంఖ్య కాస్త పలుచబడినా రోజులో ఏదో ఒక పూట భోజనం చేయనిదే తృప్తి కలగని పరిస్థితి. ఇప్పుడు ఎవరు ఏ సమయంలో తింటారో తెలియదు, ఏం తింటున్నారో కూడా అడిగేందుకు సమయం ఉండకపోవడం కుటుంబంలో అనారోగ్య వాతావరణానికి కారణమవుతోంది. అందరూ కలసి కూర్చొని భోజనం చేయడం ద్వారా కష్టసుఖాలు పాల్పంచుకునే అవకాశం ఉంటుంది. దీని వెనుక ఉద్దేశం మారిపోయి.. ఆకలి అయినప్పుడు తింటామనో, బయట తిని వచ్చామనే మాటలు వినిపించడం సర్వసాధారణమైంది.

కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో మానసిక రోగుల చికిత్స వివరాలు

సంవత్సరం	ఔట్ పేషెంట్లు	ఇన్ పేషెంట్లు
2021	15,942	92
2022	19,475	175
2023	9,706	283

హాస్టళ్లలో చదువు

ఇది పోటీ ప్రపంచం. మా పిల్లాడు అందరికంటే ముందుండాలనే భావన ప్రతి ఒక్క తల్లిదండ్రిలో కనిపిస్తుంది. ఈ కారణంగా పిల్లలను ఇంట్లో ఉంచుకోకుండా కార్పొరేట్ హాస్టళ్లలో ఉంచి చదివించడం ఫ్యాషన్ అయిపోయింది. అగ్గి పెట్టెల్లాంటి రూముల్లో.. మంచీచెడు తెలియకుండా రోజులు గడిచిపోతున్నాయి. అమ్మానాన్నల ఆప్యాయతకు దూరమవుతూ.. బంధాల విలువ తెలియకుండా ర్యాంకుల వెంట పరుగులు తీయడంతోనే బాల్యం దాటిపోతుంది, యవ్వనం చేజారిపోతుంది. ఆ తర్వాత కూడా ఇంటికి చుట్టపుచూపుగానే వస్తుండటంతో విలువలు వీధిపాలవుతున్నాయి.

పండగలూ పబ్బాలకే..

గతంలో శుభకార్యమైనా, చావుకైనా పది మంది కలిసేవాళ్లు. మంచీచెడు చెప్పి వెళ్లేవాళ్లు. రాత్రి పూట ఆరుబయట మంచాలు వేసుకొని పొద్దుపోయే దాకా కబుర్లు చెప్పుకుంటూ కష్టసుఖాలు పంచుకునేవాళ్లు. ఇప్పుడు ఎవరైనా చనిపోతే కనీసం ఖర్మకాండలు ఎలా చేయాలనే విషయం కూడా తెలియక తికమకపడుతున్నారు. పెళ్లిళ్లు.. శుభకార్యాలంటే ప్రతి ఒక్కరి అడుగు 'బ్రాహ్మణుల' ఇంటి వైపునకే పడుతోంది తప్పితే ఒక్కటంటే ఒక్కటీ సొంతంగా చేసుకోలేకపోవడం ఆధునికత ఏ పరిస్థితికి దారితీస్తుందో అర్థమవుతోంది. ఆహ్వానాలు, హాజరు కూడా మొక్కుబడిగానే ఉండటం చూస్తే మనిషికి, బంధాలకు మధ్య దూరం ఏ స్థాయిలో పెరుగుతుందో తెలుస్తోంది.

సెల్‌ఫోన్లతో సరి..

సర్దుబాటు ధోరణి మచ్చుకైనా కనిపించడం లేదు. పక్కోడి నీడను కూడా సహించలేని పరిస్థితి. వయస్సు పెరిగే కొద్దీ సహనం, ఓర్పు కనిపించాల్సి ఉండగా.. అసూయ ద్వేషాలకు పెద్దపీట వేస్తున్నారు. చిన్న చిన్న మాటలకు పట్టింపులకు పోయి బంధాలనే వదులుకోవడం, అసలు వాళ్లతో ఏమి అవసరం ఉందనే భావన అధికమైంది. ఇందుకు సెల్‌ఫోన్లతో కాలం గడపటం, గంటల కొద్దీ వాటితోనే సావాసం చేయడం ప్రధాన కారణం. ఇంట్లోనే ఉంటున్నా ఎవరూ మాట్లాడుకోకుండా సెల్‌ఫోన్‌పై చేతులు కదుపుతున్నారు. ఫ్రెండ్స్ కలిశామన్న మాటే కానీ చూపంతా సెల్‌ఫోన్ పైనే ఉంటోంది.

ఒక్కరు మరణించినా..

పిల్లలు మంచి హోదాలో ఉండాలని తల్లిదండ్రులు ఎంతగానో తపిస్తున్నారు. ఇందుకోసం తమ జీవితాలను ఫణంగా పెడుతున్నారు. పైసాపైసా కూడబెట్టి మరీ భవితకు బాటలు వేస్తున్నారు. తీరా లక్ష్యం చేరుకోగానే.. పిల్లలు తల్లిదండ్రులకు దూరంగా బతుకుతున్నారు. పిల్లోడు బాగుపడితే చాలనుకొని కొంత కాలం దంపతులు ఇద్దరూ నెట్టుకొస్తున్నా.. వృద్ధాప్యంలో మనోవేదనతో మంచం పడుతున్నారు. ఈ సమయంలో ఇద్దరిలో ఒకరు మరణించిన మరొకరి జీవనం దుర్భరంగా మారుతోంది. మరీ ముఖ్యంగా భార్య మరణిస్తే.. ఆ వెంటనే భర్త కన్ను మూయడం చూస్తే.. పిల్లలు దూరమైతే ఎలాంటి పరిస్థితి ఉంటుందో అర్థమవుతుంది.

పిల్లలకు సమయం కేటాయించాలి



తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతగా మెలగాలి. మరీ ముఖ్యంగా వారితో గడిపేందుకు సమయం కేటాయించాలి. ప్రతి ఒక్కరూ ఐదు టీలు(టైం, టాక్, ట్రీట్, టచ్, ట్రస్ట్) పాటించాలి. అప్పుడే పిల్లలతో బంధం బలపడుతుంది. తల్లిదండ్రుల స్పర్శ పిల్లలకు సరికొత్త అనుభూతితో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుంది. నమ్మకం పెంపొందినప్పుడే కుటుంబ వ్యవస్థ బలపడుతుంది.

– సి.జ్యోతిర్మయి, ఫ్యామిలీ కౌన్సిలర్, బిహేవియర్ థెరపిస్ట్, కర్నూలు

బేతంచెర్లలో ఏపీఐఐసీ ఆటో నగర్



బేతంచెర్లలో ఆటోనగర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి బుగ్గన

బేతంచెర్ల: విజయవాడ తరహాలో బేతంచెర్లలో 41 ఎకరాల్లో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) ఆటో నగర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణానికి సమీపాన అయ్యల చెర్వులోని కర్నూలు రహదారిలో ఆటో నగర్ శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించి, భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 7 ఎకరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఆటో నగర్ మధ్యన జాతీయ రహదారి వెళ్తున్నందున మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంటుందన్నారు. ఎలక్ట్రిక్, వెల్డింగ్ విడి భాగాలతో సహా అన్ని ఒకే చోట లభించేలా వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు విద్య, వైద్యంతో పాటు అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. తన తాత రావు బహదూర్ బీపీ శేషారెడ్డి సొంత నిధులు వెచ్చించి బేతంచెర్ల పట్టణంలో స్కూలు, ఆసుపత్రులు, పశువైద్య శాల, గుడి, కళ్యాణ శాల నిర్మించారన్నారు. తాను కూడా ఆయన బాటలో నడుస్తూ పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

నియోజకవర్గంలో ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి అన్నారు. 40 ఏళ్లలో గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి నాలుగేళ్లలో తమ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. అనంతరం కొమ్మూరు కొట్టాల సమీపాన ఎర్రజాల, బిల్ల స్వర్గం గుహల వద్ద ఏపీ టూరిజం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, జోనల్ మేనేజర్ విశ్వేశ్వరరావు, ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలి, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్లు ఖాజా, మురళీ కృష్ణ, ఆర్డీఓ వెంకటరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ విద్య

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అదే
- నాలుగో విడత అమ్మఒడి నిధుల విడుదల
- జిల్లాలో 1,67,084 మంది తల్లుల ఖాతాల్లో రూ.217.20 కోట్లు జమ
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్
- హాజరైన ఎమ్మెల్సీ, మార్క్‌ఫెడ్ చైర్మన్, ప్రభుత్వ సలహాదారుడు



అమ్మఒడి మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ, మార్క్‌ఫెడ్ చైర్మన్, అధికారులు

నంద్యాల: 'చదువుకు పేదరికం అడ్డుకారాదు. ప్రతి ఒక్కరు చదువుకోవాలి. ఈ ఆశయంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం అమలు చేస్తున్నార'ని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో అమ్మఒడి నాలుగో విడతను ముఖ్యమంత్రి ప్రారంభించారు. బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మైనార్టీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునిత అమృతరాజ్, డీఈఓ సుధాకర్‌రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తుకు అవసరమైన చదువును ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. జిల్లాలో అమ్మఒడి పథకం కింద 1,67,084 మంది ఖాతాల్లో రూ.217.20 కోట్లు జమ చేసిందన్నారు. ప్రభుత్వ సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. గతంలో ప్రభుత్వ స్కూళ్లలో కనీస సదుపాయాలు ఉండేవి కాదన్నారు. నేడు ప్రతి పాఠశాల కార్పొరేట్‌ను తలపిస్తుందన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా మాట్లాడుతూ పేద పిల్లల విద్యాభివృద్ధికి సీఎం ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. అమ్మఒడి పథకం అమలు అందులో భాగమేనన్నారు.ఈ పథకం పేదల జీవితాల్లో మార్పులు తెస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, మార్క్ ఫెడ్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్ విద్యార్థుల తల్లులకు అమ్మఒడి పథకానికి సంబంధించిన మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నియోజకవర్గం	తల్లుల సంఖ్య	జమైన నిధులు రూ.కోట్లలో
ఆళ్లగడ్డ	27,773	36.10
బనగానపల్లె	27,128	35.26
డోన్	28,575	37.14
నందికొట్కూర్	25,560	33.22
నంద్యాల	26,580	34.55
పాణ్యం	8,536	11.09
శ్రీశైలం	22,932	29.81

టీడీపీ నాయకులవి మాయ మాటలు

- ప్రజలను మోసగించడమే వారి పని
- వైఎస్‌ఆర్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి ధ్వజం
- బీసీకి మళ్లీ ఓటమే–ఎమ్మెల్యే కాటసాని
- కొలిమిగుండ్లలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం
- హాజరైన ఎంపీ, జెడ్పీ చైర్మన్

బీసీది నీచ చరిత్ర

యువగళం పాదయాత్రలో లోకేష్, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డి బనగానపల్లెలో చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తీవ్రంగా స్పందించారు. 2019 ఎన్నికల్లోనే ప్రజలు బీసీ జనార్ధనరెడ్డిని ఓడించి జెండా పీకేశారన్నారు. 2024లో కూడా ఇదే పునరావృతమవుతుందని చెప్పారు. తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణంలో మూడు వేల పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇస్తుంటే కోర్టుకు వెళ్లి అడ్డుకున్న నీచ చరిత్ర బీసీదని ధ్వజమెత్తారు. కొలిమిగుండ్లలో పేదలకు భూ పంపిణీ చేస్తుంటే హైకోర్టులో పిల్ వేశారన్నారు. పేదలకు మేలు జరగకుండా అడ్డుకోడమే టీడీపీ నాయకులు పనిగా పెట్టుకున్నారన్నారు.

కొలిమిగుండ్ల: రాష్ట్రంలో ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రజలను మోసగించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు మాయమాటలు చెబుతున్నారని, నమ్మి మోసపోవద్దని ఉమ్మడి జిల్లాల వైఎస్‌ఆర్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. మండల కేంద్రం కొలిమిగుండ్లలో రూ.3 కోట్లతో రెండు గ్రామ సచివాలయాలు, రెండు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, ఉద్యాన పంటల సేకరణ కేంద్రం, సీసీ రోడ్లు, క్లోజింగ్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. వాటిని బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల సమయంలో పొదుపు మహిళలు, రైతులకు రుణాలు మాఫీ చేస్తానని నమ్మించి నిండాముంచారన్నారు. బాబు చేసిన ద్రోహంతో వారంతా అప్పుల పాలై ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతుండటంతో మళ్లీ మోసపూరిత హామీలు ఇస్తున్నారని చెప్పారు. లోకేష్‌తో పాటు టీడీపీ నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిట్టడం పనిగా పెట్టుకున్నారని, అయితే వారు ఎన్ని జన్మలెత్తినా జగన్‌కు సాటిరారన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో 2019 ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సీపీ 151 సీట్లు గెలిచింది అని, ఈ విషయాన్ని ప్రతిపక్ష పార్టీ నాయకులు గుర్తు పెట్టుకోవాలన్నారు.

మాట తప్పని వ్యక్తి వైఎస్ జగన్

పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్న గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి అన్నారు. నాలుగేళ్ల పాలనలోనే 98 శాతం హామీలు అమలు చేసి రికార్డు సృష్టించారన్నారు. నాలుగేళ్ల నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో ఈ ప్రాంతంలోని జలాశయాలు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. పాడి పంటలతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. చంద్ర బాబు హయాంలో వారంతా కరువు కాటకాలతో అల్లాడరన్నారు.





గ్రామ సచివాలయం ప్రారంభోత్సవంలో ఎంపీ పోచా, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని, ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో భారీ సభకు హాజరైన జనం

గ్రామ స్థాయిలో సుపరిపాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థ ద్వారా తీసుకొచ్చారని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు గ్రామాల్లోనే అందుతున్నాయన్నారు. టీడీపీ హయాంలో కొలిమిగుండ్లలో ప్రధాన రోడ్డు అధ్వానంగా ఉండేదన్నారు. ఇప్పుడు కోటి రూపాయలతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కాటసాని ఓబుళరెడ్డి, కాటసాని ప్రసాదరెడ్డి, కొలిమిగుండ్ల, అవుకు వైఎస్‌ఆర్‌సీపీ మండల అధ్యక్షులు అంబటి గుర్విరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ కారపాకుల నాగవేణి, యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, మొలక రాజారెడ్డి, పేరం నందకిషోర్‌రెడ్డి, పేరం బ్రదర్స్, నంద్యాల జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, కొలిమిగుండ్ల సర్పంచ్ శివరాముడు, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

1 నుంచి 'జగనన్న సురక్ష' క్యాంపులు

కర్నూలు(సెంట్రల్): జగనన్న సురక్ష పథకంలో భాగంగా జూలై 1 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు సచివాలయాల పరిధిలో ప్రత్యేక క్యాంపులను నిర్వహించాలని అధికారులను ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాల కొండయ్య ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి సీఎం కార్యాలయ అదనపు కార్యదర్శి భరత్‌గుప్త, ముఖ్యమంత్రి కార్యదర్శి రేవు ముత్యాల రాజుతో కలసి ఆమె కలెక్టర్లతో జగనన్న సురక్ష పథకంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పూనం మాలకొండయ్య మాట్లాడుతూ.. జగనన్న సురక్ష పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ప్రతి మండలంలో అధికారులు రెండు బృందాలు విడిపోయి సచివాలయాల పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఆయా పరీక్షలకు బుధవారం 56 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు 210 మందికి గాను 182 మంది విద్యార్థులు, ఇంటర్ పరీక్షలకు 119మందికి గాను 91మంది హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా విద్యాశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.



దోన్ నుంచి గోవర్ధనగిరి వయా వెంకటనాయునిపల్లె రోడ్డు



రూ.3.50 కోట్లతో 3.60 కిలోమీటర్ల వరకు నిర్మించిన కొత్త రోడ్డు

తొలగిన దారిద్ర్యం

- అద్దంలా మెరుస్తున్న పల్లె రోడ్లు
- నాణ్యతతో నిర్మాణాలు
- ఆరు ప్యాకేజీల్లో ప్రారంభమైన 81 పనులు
- ఇప్పటికే 17 పూర్తి, పురోగతిలో 64 పనులు

కర్నూలు(అర్బన్): గుంతలు పడి, కనీసం నడిచేందుకు కూడా వీలులేని దుస్థితిలో ఉన్న గ్రామీణ రోడ్లకు మంచి రోజులు వచ్చాయి. ఈ రోడ్లను బాగుచేస్తే పల్లె ప్రజల 'దారి'ద్ర్యం తొలగిపోతున్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విరివిగా నిధులు మంజూరు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్‌పీ) కింద జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు ప్యాకేజీల్లో మొత్తం రూ.189.11 కోట్లతో 85 రోడ్ల పనులు మంజూరు చేసింది. కోర్టు కేసుల తో మూడు పనులు, పలు కారణాలతో మరో పని ప్రారంభం కాలేదు. మిగిలిన 81 పనుల్లో ఇప్పటికే 17 పూర్తి కాగా, 64 పనులు వేర్వేరు దశల్లో వేగంగా జరుగుతున్నాయి. ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఈ రోడ్ల పనులను చేపడుతున్నారు. ఈ పనులకు సంబంధించి పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజనీర్లు మూడు దశల్లో (జీఎస్‌బీ, డబ్ల్యూఎంఎం, బీటీ) నాణ్యతను తనిఖీ చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు ఎంతో ఇబ్బందిగా ఉన్న గ్రామీణ రోడ్లపై నేడు రయ్ ... రయ్ అంటు ప్రయాణాలు సాగుతున్నాయి.

పూర్తయిన రూ.47 కోట్ల విలువైన పనులు

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు ప్యాకేజీల్లో ఇప్పటి వరకు రూ.47 కోట్ల విలువైన పనులు జరగ్గా, మిగిలిన పనులు వేర్వేరు దశల్లో కొనసాగుతున్నాయి. చేపట్టిన ఈ పనులన్నింటిని డిసెంబర్ ఆఖరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈ పనులన్ని పూర్తయితే ఆయా నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు నాణ్యతతో కూడిన అందమైన రోడ్లు దర్శనమివ్వనున్నాయి.

నియోజకవర్గాల వారీగా చేపట్టిన పనులు..

ప్యాకేజీ నంబర్	నియోజకవర్గం	మంజూరైన పనులు	అంచనా మొత్తం (రూ.కోట్లలో)
41	ఆలూరు	44	67.12
	ఆదోని	01	0.38
	మంత్రాలయం	04	2.12
	ఎమ్మిగనూరు	03	1.97
42	పాణ్యం	03	5.95
43	పత్తికొండ	21	53.78
	కోడుమూరు	06	9.90
44(ఏ)	పత్తికొండ	01	15.03
44(బి)	కోడుమూరు	01	24.11
44(సీ)	పాణ్యం	01	8.70

నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత



ఏపీఆర్ఆర్‌పీ గ్రాంట్ కింద చేపట్టిన రోడ్ల నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోడ్డును మూడు దశల్లో తనిఖీ చేస్తున్నాం. ఇప్పటి వరకు పూర్తి అయిన రోడ్ల నాణ్యతను పరిశీలించాం. ఎక్కడా కూడా కాంట్రాక్టర్లు నాణ్యతకు రాజీ పడడం లేదు.

– రవీంద్రారెడ్డి, డీఈఈ, పీఆర్ క్వాలిటీ కంట్రోల్

ట్రాన్స్‌జెండర్లకు న్యాయ సహాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు(హాస్పిటల్): ట్రాన్స్‌జెండర్లు(లింగమార్పిడి చేయించుకున్న వారు)కు అవసరమైన న్యాయ సహాయం చేయడానికి ఒక ప్రత్యేక న్యాయవాదిని ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్. వెంకట నాగశ్రీనివాసరావు చెప్పారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న సదరం క్యాంప్ ఆఫీస్‌లో ట్రాన్స్‌జెండర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలులోని ట్రాన్స్‌జెండర్లకు వన్‌స్టాప్ సెంటర్‌లో విలేజ్ లీగల్ కేర్ అండ్ సపోర్ట్ సెంటర్‌ను ప్రారంభించి, న్యాయ సేవలు అందించాలని ఆదేశించారు. వన్‌స్టాప్ సెంటర్‌లో ఫిర్యాదులకు హాజరయ్యేందుకు పి. శివ సుదర్శన్‌ను ప్యానెల్ న్యాయవాదిగా నియమించినట్లు తెలిపారు. నెలలో రెండుసార్లు ట్రాన్స్‌జెండర్లకు సంబంధించి ఏవైనా అసౌకర్యాలు, సేవలో లోపాలు ఉంటే చర్చించి పరిష్కరిస్తారన్నారు. అనంతరం 18 మంది ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అధికారి డాక్టర్ భాస్కర్, ప్యానెల్ లాయర్ పి. శివసుదర్శన్, వన్‌స్టాప్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంజయ్, వాలంటరీ హెల్త్ సర్వీస్ రీజనల్ కో ఆర్డినేటర్ వి. వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థి తండ్రికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న క్లస్టర్ వర్సిటీ వీసీ సాయిగోపాల్ తదితరులు

కర్నూలు సిటీ: సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీకి చెందిన ఇద్దరి పేద విద్యార్థులకు ఆ కాలేజీ పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు ఆర్థిక సాయం చేశారు. క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ సాయిగోపాల్ చేతుల మీదుగా బుధవారం విద్యార్థులకు సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ కాలేజీ ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ.. కోటి అనే అంధ విద్యార్థికి పూర్వ విద్యార్థులు, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసులు ఓ ల్యాప్‌ట్యాప్‌ను కొనిచ్చారన్నారు. గుడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన థర్డ్ ఇయర్ బీఎస్సీ చదువుతున్న సలీంబాషా అనే విద్యార్థి ప్రమాదంలో గాయపడి నెల రోజులుగా ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ విద్యార్థి తండ్రి అలీపీరాకు అధ్యాపకులు రూ.93,500 ఆర్థిక సాయాన్ని అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ కేవైసీకి నెలాఖరు వరకే గడువు

కర్నూలు(అగ్రికల్చర్): పీఎం కిసాన్ కింద సాయం పొందేందుకు ఈ నెల చివరిలోపు రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 2,53,895 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకు 2,27,633 మంది ఈ కేవైసీ చేయించుకున్నట్లు తెలిపారు. ఈ కేవైసీ చేయించుకోని రైతుల జాబితాను అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఆధార్ నంబర్లుతో సహా ఉంచినట్లు పేర్కొన్నారు. రైతులు ఈ జాబితాలను చూసుకుని, పీఎం కిసాన్ సాయం పొందడానికి అర్హులు కావాలని కోరారు.

అనుమానంతో భార్యపై కత్తితో దాడి

- ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

కర్నూలు: నగర శివారులోని జొహరాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్న చక్రధర్ రావు భార్య సునీతపై అనుమానంతో తలపై బాది కత్తితో పొడిచి పరారయ్యాడు. కర్నూలులోని మారుతీ నగర్‌కు చెందిన సునీతతో చక్రధర్ రావుకు ఏడేళ్ల క్రితం వివాహమయ్యింది. భర్త ప్లాట్ల వ్యాపారం చేస్తుండగా, భార్య సునీత ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. స్కూల్‌లో పనిచేసే సహోద్యోగితో వివాహేతర సంబంధం ఉందని కొంతకాలంగా అనుమానం పెంచుకున్నాడు. అనుమానం పెనుభూతమై బుధవారం ఉదయం భార్య కిరాణా అంగడికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో తలపై కర్రతో కొట్టి, పిడిబాకుతో పొడిచాడు. దీంతో ఆమె రోడ్డుపై పడిపోగా చనిపోయిందని భావించి ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. విషయం తెలిసిన వెంటనే మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ ఆధారంగా చక్రధర్.. తలముడిపిలో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. చక్రధర్ రావు, సునీత దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. సంఘటన జరిగిన వెంటనే 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించారు. ప్రస్తుతం ఆమె ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

బ్లాక్ టీచింగ్.. చీటింగ్!

- అక్రమాలకు పాల్పడిన పలు బీఈడీ కాలేజీలు
- ఇంటర్న్‌షిప్ చేయకపోయినా చేసినట్లు సర్టిఫికేషన్
- సర్టిఫికెట్ ఇచ్చిన హెచ్‌ఎంలపై చర్యలు శూన్యం
- డీఈఓ కార్యాలయంలో చక్రం తిప్పిన ఓ ఉద్యోగి



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

కర్నూలు సిటీ: ఛాత్రోపాధ్యాయుల బ్లాక్ టీచింగ్(ఇంటర్న్‌షిప్)లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అక్రమార్కులపై వేటు పడకుండా కర్నూలు డీఈఓ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి చక్రం తిప్పినట్లు సమాచారం. బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ)కోర్సు అభ్యసించే ఛాత్రోపాధ్యాయులను థర్డ్, ఫోర్త్ సెమిస్టర్ సమయంలో బ్లాక్ టీచింగ్(ఇంటర్న్‌షిప్)కు పంపిస్తారు. ఇందుకు రాయలసీమ యూనివర్సిటీ అధికారులు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఇంటర్న్‌షిప్‌కు స్కూళ్లను కేటాయించాలని కోరుతారు. బీఈడీ కాలేజీల యాజమాన్యాలు సైతం ఈ మేరకు డీఈఓకు విన్నవించుకోవాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని కొన్ని బీఈడీ కాలేజీలు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా 2020-22 బ్యాచ్‌కి చెందిన ఛాత్రోపాధ్యాయులు బ్లాక్ టీచింగ్(ఇంటర్న్‌షిప్) చేసినట్లు చూపించాయి. పలు ఫిర్యాదులు రావడంతో ఎన్ని కాలేజీలకు బ్లాక్ టీచింగ్‌కి అనుమతులు ఇచ్చారో వివరాలు ఇవ్వాలని ఈ ఏడాది జనవరిలో డీఈఓకు రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ లేఖ రాశారు. ఈ లేఖకు ఈ ఏడాది మార్చి 2వ తేదిన స్పందిస్తూ.. 11 కాలేజీలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సమాధానం ఇచ్చారు. అనుమతులు ఇవ్వకుండానే బ్లాక్ టీచింగ్ చేసినట్లు సర్టిఫై చేశారనే ఆరోపణలు వచ్చిన హెచ్‌ఎంలపై డీఈఓ చర్యలు తీసుకోకుండా 20 రోజుల్లోనే కొన్ని కాలేజీలకు అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు డీఈఓ కార్యాలయంలో పని చేసే ఓ ఉద్యోగి చక్రం తిప్పినట్లు సమాచారం.

అనుమతులకు అక్రమ వసూళ్లు!

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని 2020-22 విద్యా సంవత్సరానికి కర్నూలు జిల్లాలో 22, నంద్యాల జిల్లాలో 20 బీఈడీ కాలేజీలకు బ్లాక్ టీచింగ్‌కి అనుమతులు ఇవ్వాల్సి ఉంది. అయితే కర్నూలు జిల్లాలో 11 కాలేజీలకు మాత్రమే అనుమతులు ఇచ్చామని, మరో 11 కాలేజీలకు ఇవ్వలేదని ఆర్‌యూ అధికారులకు డీఈఓ తెలిపారు. ఆ తరువాత కొద్ది రోజులకే కొన్ని కాలేజీలకు అనుమతులు ఇవ్వడం గమనార్హం. ఇదిలా ఉండగా 2021-23 విద్యా సంవత్సరానికి సంబంధించి బ్లాక్ టీచింగ్ కోసం అనుమతులు ఇచ్చేందుకు ఒక్కో కాలేజీ నుంచి రూ.15 వేల నుంచి రూ. 25 వేల వరకు కర్నూలులో బుధవారపేటలోని ఓ హోటల్‌లో బేరం కుదుర్చుకుని వసూలు చేసినట్లు తెలుస్తోంది. మామూళ్లు వసూలు చేయడంలో డీఈఓ కార్యాలయంలో ఓ ఉద్యోగి కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. వసూలు చేసిన మొత్తాన్ని వాటాలుగా పంచుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు ఇవ్వకుండానే బ్లాక్ టీచింగ్ చేసినట్లు సర్టిఫై చేసిన ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోకుండా కాలేజీల యాజమాన్యాలు డీఈఓపై ఒత్తిడి చేస్తున్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం



2020-22 విద్యా సంవత్సరానికి 22 కాలేజీలకు బ్లాక్ టీచింగ్‌కి అనుమతులు ఇవ్వాలని రాయలసీమ యూనివర్సిటీ అధికారులు కోరారు. ఇందులో 11 కాలేజీలకు మాత్రమే మొదట ఇచ్చాం. మార్చి నెలలో 11 కాలేజీలకు అనుమతులు ఇవ్వలేదని యూనివర్సిటీ అధికారులకు తెలిపిన మాట వాస్తవమే. అయితే యూనివర్సిటీ అధికారులు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాల్సి ఉందంటే కొన్నింటికి అనుమతులు ఇచ్చాం. అనుమతులు ఇవ్వకుండానే బ్లాక్ టీచింగ్ చేసినట్లు సర్టిఫై చేసిన హెచ్‌ఎంలపై విచారించి చర్యలు తీసుకుంటాం.

– రంగారెడ్డి, డీఈఓ

దివ్యాంగుల హాస్టల్‌కు రూ.72 లక్షల నిధులు



హాస్టల్‌లో వైట్‌వాష్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు(అర్బన్): నగరంలోని బీ క్యాంప్‌లో రూ.2.85 కోట్లతో పూర్తి కావొచ్చిన దివ్యాంగుల హాస్టల్‌కు ప్రభుత్వం అదనంగా రూ.72 లక్షలను విడుదల చేసిందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిసా ఫాతిమా తెలిపారు. బుధవారం సాయంత్రం ఆమె ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈఈ జీ నాగరాజుతో కలిసి వసతి గృహంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. వంద మంది శారీరక వికలాంగులకు అవసరమైన విధంగా హాస్టల్‌లో 17 గదులు, విశాలమైన డైనింగ్ హాల్, కిచెన్, రెండు అంతస్థుల్లో ఆధునిక వసతులతో టాయ్‌లెట్లు, పై అంతస్థులోకి వెళ్లేందుకు ర్యాంప్, ర్యాంప్‌కు ఇరువైపులా రెయిలింగ్, లిఫ్ట్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు సంబంధించిన మూడు చక్రాల వాహనాలు పార్కు చేసుకునేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించామన్నారు. డీఈఈ నాగరాజు మాట్లాడుతూ హాస్టల్‌కు సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ కనెక్షన్, తాగునీరు, ప్రహరీగోడ, శానిటేషన్ పనులు మాత్రమే చేపట్టాల్సి ఉందన్నారు. ఈ పనులను నెల రోజుల్లోపు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ సురేంద్ర, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.